క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ యాదవనగర్, సౌత్ ఎండ్ పార్కు ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. 11కేవీ గణేశ్‌పురి, హౌసింగ్‌బోర్డు ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ ఖిల్లామైసమ్మ, వీ-గార్డ్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు. 11కేవీ చైతన్యపురి ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

చెరువుల కబ్జాలపై ఫిర్యాదు

బడంగ్‌పేట్: చెరువుల కబ్జాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అల్మాస్‌గూడకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిడి శూరకర్ణారెడ్డి సోమవారం అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) తిరుపతిరావుకు వినతిపత్రాలు అందజేశాడు. అల్మాస్‌గూడలో పలువురు అక్రమార్కులు ప్రభుత్వ చెరువులు, కుంటలు కబ్జాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కోమటికుంట చెరువులో కొందరు వ్యక్తులు కబ్జాలు చేసి అమ్మకాలు చేపట్టారని ఆరోపించారు. బాలాపూర్ రెవెన్యూ అధికారులకు, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. చెరువులు కబ్జా చేయకుండా ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే కబ్జా చేసి సృష్టించిన తప్పుడు డాక్యుమెంట్లను రద్దు చేయాలని కోరారు.

మండలి డిప్యూటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



బండ ప్రకాష్ ముదిరాజ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అంజయ్య ముదిరాజ్

మహేశ్వరం: తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికై న బండ ప్రకాష్ ముదిరాజ్‌కు సోమవారం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యదర్శి గుండెమోని అంజయ్య ముదిరాజ్ అభినందనలు తెలిపారు. నగరంలోని ఎమ్మెల్సీ నివాసంలో కలిసి ఈ మేరకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ బడుగు, బలహీన వర్గాలకు అధిక ప్రాధన్యత ఇచ్చి గౌరవిస్తున్నారని చెప్పారు. బీసీ కులాలతో పాటు ముదిరాజ్‌ల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

వైభవంగా పెద్దమ్మ తల్లి కల్యాణోత్సవం



అమ్మవారి పట్నం వద్ద ఒగ్గు కథ వింటున్న భక్తులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి గరిగుట్ట అమ్మవారి కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం 11 గంటలకు అమ్మవారి సదరు పట్నం వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి అగ్ని గుండములు తొక్కించడం, 3 గంటలకు అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారుల కథలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ధర్మకర్త కరన్‌కోట్ విఠల్‌బాబా, మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఆందోళన

హయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఏమ్మార్పీస్ పిలుపు మేరకు మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హయత్‌నగర్‌లో జాతీయ రహదారిని దిగ్బంధనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఎల్‌బీనగర్ ఇంచార్జి బత్తిన సుధాకర్ మాదిగ మాట్లాడతూ... ఎస్సీ వర్గీకరణ చేపడతామని కేంద్ర ప్రభుత్వం పలుమార్లు అనేక వేదికలపై హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ఈ సమావేశాల్లో అయినా వర్గీకరణ బిల్లును పెట్టి ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు పలువురు నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నేతలు నాగభూషణంమాదిగ, చిప్పలపల్లి సోమశేఖర్, జేపీ లతమాదిగ, బొర్ర రవిమాదిగ, కమలాకర్‌మాదిగ, సురేష్‌మాదిగ, గజ్జల రాజశేఖర్‌మాదిగ, రామకృష్ణమాదిగ, శోభ మాదిగ, చిరంజీవి మాదిగ, ప్రమోద్‌మాదిగ, కమలాకర్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా రాజరాజేశ్వరాలయం

ఒకప్పుడు ఆలయంలో మౌలిక వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడేవారు.. నేడు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని వసతులతో అభివృద్ధి చెందుతోంది. పచ్చని చెట్ల నడుమ కోనేటిలో వెలసిన ఆది దంపతులు భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారమయ్యాడు. దీంతో ఆలయానికి అంతకంతకు భక్తుల తాడికి పెరుగుతోంది.

- గతంలో సదుపాయాలు కరువు.. నేడు మెరుగు
- దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతో వసతులు
- అంతకంతకూ పెరుగుతున్న భక్తుల తాకిడి



శివగంగ రాజరాజేశ్వర ఆలయం

మహేశ్వరం: శ్రీ శివగంగ రాజరాజేశ్వర ఆలయం కాకతీయుల కాలంలో నిర్మించారు. శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని 1672లో గోల్కొండ తానీషా ఆస్థానంలో మంత్రులుగా ఉన్న అక్కన్న, మాదన్నలు ఆలయాన్ని పునరుద్ధరించారు. అనంతరం మొగలాయిల కాలంలో ఆలయంపై దాడి చేసి ఆలయాన్ని ధ్వంసం చేయడంతో శిథిలావస్థకు చేరింది. కొన్ని ఏళ్ల తర్వాత ఆలయ బాగోగులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ధూపదీపనైవేద్యాలకు దూరంగా ఉంది. 40 ఏళ్ల క్రితం మహేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన శంకర్ కత్రీ, గ్రామస్తులు కలిసి ఆలయాన్ని శుభ్రం చేసి పూజలు చేయడం ప్రారంభించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అప్పటి హోంమంత్రి, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయించి ఆలయాభివృద్ధికోసం ఈ ఆలయాన్ని దేవాదాయ ధర్మదాయ శాఖలో విలీనం చేశారు. అప్పటి నుంచి ఆలయానికి చైర్మన్, డైరెక్టర్లను ప్రభుత్వం నియమిస్తూ ప్రత్యేక కార్యకలాపాలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఆలయాభివృద్ధికి మంత్రి, ఆలయ చైర్మన్ చొరవ, దాతల సహకారంతో అంతకంతకూ అభివృద్ధి చెందుతోంది. మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఆలయ చైర్మన్ సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు, మాజీ ఆలయ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు.

16 ఆలయాల పునఃనిర్మాణం

శివగంగ రాజరాజేశ్వర ఆలయం చుట్టూ పదహారు శివాలయాలున్నాయి. హరిహరేశ్వరుడు, మల్లీశ్వరుడు, అవిముక్తేశ్వరుడు, అఘోరేశ్వరుడు, అమరేశ్వరుడు, అమృతేశ్వరుడు, గంగాధరేశ్వరుడు, ఇష్టకామేశ్వరుడు, ముక్తేశ్వరుడు, శ్రీకాళహస్తీశ్వరుడు, ఏకాంబరేశ్వరుడు, మణికంఠేశ్వరుడు, మహానందీశ్వరుడు, అమరావతీశ్వరుడు, కాశీపతీశ్వరుడు, మంగళగౌరీశ్వరుడి ఆలయాలకు శిథిలావస్థకు చేరుకున్నాయి. దాతల సహకారంతో ఈ 16 ఆలయాలను పునఃనిర్మించారు.

- మంత్రి సబితారెడ్డి రూ.25లక్షల ఖర్చుతో భక్తులు కూర్చునేందుకు షెడ్డు నిర్మించారు. అభివృద్ధి పనులకు మరో రూ.15లక్షలు అందజేశారు.
- ఆలయం ఎదుట శివ,పార్వతుల కల్యాణోత్సవానికి మహేశ్వరం గ్రామానికి చెందిన దాత ఏనుగు సూర్యనారాయణరెడ్డి రూ.25 లక్షలతో కల్యాణ మండపం నిర్మించారు.
- రూ.9లక్షలతో ఆలయం చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేశారు.
- ఆలయం చుట్టూ ఉన్న పదహారు శివాలయాల పక్కన తమిళనాడు శిల్పిలతో శివపార్వతుల విగ్రహాలను ఏర్పాటు చేశారు.
- ఈఓ, చైర్మన్‌లకు కేబిన్, టికెట్ కౌంటర్ ఏర్పాటు
- శివగంగలో వాటర్ ఫౌంటేన్‌ను ఏర్పాటుతో పాటుగా భక్తులు విహరించేందుకు బోటు(పడవ) సౌకర్యం కల్పించారు.

భక్తుల సంఖ్య పెరిగింది



శివగంగ రాజరాజేశ్వర ఆలయం గతంతో పోల్చుకుంటే ఎంతో అభివృద్ధి చెందింది. ప్రతీ సోమవారంతో భక్తుల తాకిడి సాధారణ రోజులకన్నా ఎక్కువైంది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ పాలకవర్గం అన్ని ఏర్పాట్లు చేసింది. శివరాత్రి బ్రహ్మోత్సవాలు, దేవీ నవరాత్రి ఉత్సవాలు, శ్రావణమాస పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయాభివృద్ధికి మరిన్న నిధులు కేటాయించాలని మంత్రి కోరాం. ఆమె సానుకూలంగా స్పందించారు.

– కర్రోళ్ల ప్రియాంక, సర్పంచ్, మహేశ్వరం

మంత్రి, దాతల సహకారంతో అభివృద్ధి



శివగంగ రాజరాజేశ్వర ఆలయాన్ని పరమ శివుడి అనుగ్రహంతో అభివృద్ధి చేస్తున్నాం. ఆలయం దేవాదాయ, ధర్మాదాయ శాఖలో విలీనమైనప్పటి నుంచి మంత్రి సబితారెడ్డి, దాతలు, ఆలయ డైరెక్టర్లు, మాజీ డైరెక్టర్లు, మాజీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడ్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– నిమ్మగూడెం సుధీర్ గౌడ్, ఆలయ చైర్మన్, మహేశ్వరం

ప్రసిద్ధ శైవ క్షేత్రంగా తీర్చిదిద్దుతా



శివగంగ రాజరాజేశ్వర ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తా. కాకతీయులు నిర్మించిన అతి పురాతన శివాలయం మహేశ్వరంలో కొలువుదీరడం ఈ ప్రాంతవాసుల అదృష్టం. గతంతో పోల్చుకుంటే ఆలయం ఎంతో అభివృద్ధి చెందింది. ఆలయ చరిత్రను సీఎం కేసీఆర్‌కు వివరించి మరిన్ని నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తా. జిల్లాలోనే ప్రసిద్ధ శైవ క్షేత్రంగా తీర్చిదిద్దుతా.

– పి.సబితారెడ్డి, విద్యాశాఖ మంత్రి

అధికారులకు అభినందనల వెల్లువ



డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ అంజయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కౌన్సిలర్ తదితరులు

తుక్కుగూడ: మహేశ్వరం జోన్‌కి నూతనంగా నియమితులైన డీసీపీ సీహెచ్.శ్రీనివాస్, మహేశ్వరం ఏసీపీ అంజయ్యలను తుక్కుగూడ మున్సిపల్ కౌన్సిలర్ బి.రవినాయక్, బీఆర్ఎస్ నాయకులు రాజుముదిరాజ్, శ్రీకాంత్‌గౌడ్‌లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కొత్తగా మహేశ్వరం జోన్‌కి వచ్చిన డీసీపీ, ఏసీపీ కార్యాలయాలను తుక్కుగూడ టౌన్‌లో ఏర్పాటు చేసినందుకు విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ రాంరెడ్డి

బడంగ్‌పేట్: కల్యాణలక్ష్మితో పేదింటి ఆడపిల్లల వివాహానికి ఇబ్బందులు తొలిగాయని బడంగ్‌పేట 24వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని జయశంకర్ కాలనీలో నివాసం ఉంటున్న అంజయ్య వసంత దంపతుల కూతురు వివాహం గతేడాది నిర్వహించారు. సోమవారం ప్రభుత్వం నుంచి వచ్చిన కల్యాణలక్ష్మి చెక్కును కార్పొరేటర్ లబ్ధిదారులకు అందజేశారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

- ఆందోళనలో విద్యార్థులు
- నూతన భవనం నిర్మించాలని డిమాండ్



నిరుపయోగంగా మారిన రావిర్యాల ప్రాథమిక పాఠశాల భవనం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. యాభై ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం మరమ్మతులకు నోచుకోకపోవడంతో వృధాగా మారింది. దీంతో ఆ భవనం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో ఆ భవనంలో విషపురుగులు నివసించే అవకాశం ఉన్నందున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 200మంది విద్యార్థులు ఉన్నారు. వారికి సరిపడా తరగతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన 'కృష్ణవేణి'



పతకాలు సాధించిన విద్యార్థులు

మీర్‌పేట: న్యూ డ్రాగన్ ఫైటర్స్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సెకండ్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మీర్‌పేట గాయత్రినగర్‌లోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌లో తమ విద్యార్థులు పాల్గొని స్వర్ణ, రజతం, కాంస్య పతకాలు సాధించడంతో పాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకున్నారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు శిక్షకులు దాసరి జితేందర్‌ను సోమవారం పాఠశాలలో వైస్ చైర్మన్ శ్రీనివాస్, ప్రెసిడెంట్ జైస్వాల్‌రెడ్డి, డైరెక్టర్ సురేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జార్జ్‌పాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

తృతీయ స్థానంలో 'బాలానగర్ షోటోకాన్'

హుడాకాంప్లెక్స్: అంతర్జాతీయ మార్షల్‌ఆర్ట్స్ పోటీలలో బాలానగర్ షోటోకాన్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన గోనెల గౌరీశంకర్, వి.కీర్తన సత్తా చాటారని మాస్టర్ మురళి తెలిపారు. ఈ మేరకు సోమవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షోటోకాన్ ఇనిస్టిట్యూట్ మాస్టర్ మురళి మాట్లాడుతూ.. న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండవ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారన్నారు. ఈ పోటీలకు నాలుగు దేశాలకు చెందిన 2,500 మంది విద్యార్థులు పాల్గొనగా.. 12 సంవత్సరాల విభాగంలో తమ ఇనిస్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు గౌరీశంకర్, కీర్తన మూడవ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

దళిత మోర్చా నాయకుడు శ్రవణ్‌కుమార్



కమిషనర్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మీర్‌పేట: ప్రభుత్వ భూములను కాపాడాలని బీజేపీ దళిత మోర్చా నాయకుడు చెవ్వ శ్రవణ్‌కుమార్ సోమవారం అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ రెవెన్యూ పరిధి సర్వే నెం 124 లో కొంత స్థలం మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి కేటాయించగా మిగిలిన స్థలాన్ని కొందరు అక్రమార్కులు నిర్మాణాలు చేపట్టారు. దీంతో గతంలో రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఆ నిర్మాణాలు కూల్చివేశారన్నారు. కాగా ఇదే స్థలాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు మరలా ఆక్రమించి యథేశ్చగా నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన కమిషన్ సీహెచ్. నాగేశ్వర్, బాలాపూర్ తహసీల్దార్, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి స్థలాన్ని కాపాడాలని కోరినట్లు శ్రవణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఓర్సు స్వామికుమార్, ముఖేష్ తదితరులున్నారు.

బాబా ఆలయంలో 'స్వచ్ఛ సర్వేక్షణ్'



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొన్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం పరిసరాల్లో ఉన్న చెత్త తొలగించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. కాలనీ సంక్షేమానికి కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.చంద్రమోహన్, ఉపాధ్యక్షులు వై.మల్లేష్, ఎస్.కేదార్‌నాథ్, ప్రధాన కార్యదర్శి పెద్దిని కిరణ్, శ్రీనివాసచారి, రాజేంద్రప్రసాద్, నాగరాజు, పి.వెంకటేశ్, రాచూర్ వెంకటయ్య, కాలనీవాసులు ఉన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీజేపీదే గెలుపు: కాసం

వనస్థలిపురం: ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ గెలుపునకు దోహదపడతాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వనస్థలిపురంలో నిర్వహించిన ప్రజల గోస-బీజేపీ భరోసా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా బీజేపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి మాట్లాడుతూ... ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎమ్మెల్యే విఫలం అయ్యారని ఆరోపించారు. పది మంది కార్పొరేటర్లను గెలిపించుకున్న నియోజకవర్గ ప్రజలు బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... డివిజన్ ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను ఒక్కటొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్, నూతి శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, క్రాంతి గౌడ్, చిన్న యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయండి

పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎల్మినేడు అనుబంధ గ్రామం మెటిల్లాకు చెందిన 30 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పార్టీ కండువాలు కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లనే పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని మరిచిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జడల రవీందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేశ్, పార్టీలో చేరిన వారిలో నాగేష్, సాయిరాం, శ్రీను, శివ, చింటూ, ప్రశాంత్, లింగస్వామి, నవీన్, ప్రశాంత్, సత్తయ్య, ఆనంద్, నరసింహ, రాములు, మహేందర్, దానయ్య, శంకర్, లోకేశ్, చిలుకయ్య, దేవేందర్, మధు, శ్రీకాంత్, విష్ణు, రమేశ్ తదితరులున్నారు.

శతచండీ యాగానికి ఆహ్వానం

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని బీఎన్‌రెడ్డి నగర్‌లోని సాగర్‌కాంప్లెక్స్‌లో నవీన్‌శర్మ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 19వరకు శతచండీ యాగం నిర్వహించ తలపెట్టారు. ఈ యాగానికి మండల పరిధిలోని శెట్టిపెల్లి గ్రామానికి చెందిన ఎగిరిశెట్టి సత్యం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నరేశ్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' వినియోగించుకోండి



కంటి వెలుగు కార్యక్రమ ప్రారంభోత్సవంలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: ప్రతీ ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ చిగురింత పారిజాత సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీలో కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, స్థానిక కార్పొరేటర్ బోయపల్లి దీపిక ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అమరేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, యాదగిరి, చందురెడ్డి, ఎంగలి రమేష్, ఆర్పీఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని మేయర్ పారిజాత అధికారులకు సూచించారు. కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్‌లోని 27వ డివిజన్‌లో వేస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నాదర్‌గుల్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న శ్రీవాణి

కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: పరిసరాల పరిశుభ్రత పాటించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. చెత్తను వీధుల్లో వేయకుండా ఇంటి ముందుకు వచ్చే స్వచ్ఛ ఆటోలోనే వేయాలని ఆమె కాలనీవాసులకు సూచించారు. సోమవారం సరూర్‌నగర్ పాత గ్రామంలో ప్రజలకు అవగాహన కోసం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. చెత్తరహిత డివిజన్‌గా మార్చేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంకీ సంస్థ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులు వినయాన్ని అలవర్చుకోవాలి

ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ

హస్తినాపురం: విద్యతోపాటు వినయాన్ని అలవర్చుకున్నప్పుడే విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తారని ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ పేర్కొన్నారు. కర్మన్‌ఘాట్‌లోని పవిత్ర ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీపీ మాట్లాడుతూ... విద్యార్థులకు విద్యతోపాటు విజ్ఞానం, వినోదం అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు ఎంతవరకు స్వేచ్ఛ ఇవ్వొచ్చు... ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోకుండా చూస్తూ ఎలా సద్వినియోగం చేసుకోవచ్చు అనే విషయాలను ఉపాధ్యాయులు వివరించాలని సూచించారు. పవిత్ర ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ వై.వెంకటేశ్ మాట్లాడుతూ... తమ పాఠశాలలో విద్యతోపాటు క్రీడలు, వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆటపాటలతో అందరినీ అలరించారు.

అనాథలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ పారా మెడికల్ ఎంప్లాయిస్ సభ్యులు

బడంగ్‌పేట్: కుష్టువ్యాధి నిర్మూలన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా రిటైర్డ్ పారా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ఉన్న మాతృదేవోభవ అనాథ, మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో దుప్పట్లు అందజేశారు. అనంతరం ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్, బడంగ్‌పేట కార్పొరేషన్ పరిసర ప్రాంతాలలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. సోమవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా మాతృదేవోభవ ఆశ్రమంలో 112 మందికి దుస్తులు, దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ ఆర్.సద్గుణాచారి, విద్యాసాగర్‌రావు, పి.సత్యనారాయణ, వి.సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, గురుప్రకాశ్, బాలసుబ్రమణ్యం, విశ్వనాథ్, ఆశ్రమ నిర్వాహకులు గట్టు గిరి తదితరులు పాల్గొన్నారు.